పింఛను మంజూరు చేయరూ...

ప్రజాశక్తి-హుకుంపేట:ఇంట్లో పెద్ద దిక్కు భర్త చనిపోవడంతో ఆమె అవస్థలు పడుతోంది. పింఛన్ కూడా మంజూరు కాక పోవడంతో పూట గడవడం కష్టంగా మారింది .మండలంలోని కొంతిల్లి గ్రామ పంచాయితీ చెందిన దురు బాలమ్మి (70)కు గత రెండు సంవత్సరాల నుంచి పింఛను మంజూరు కాలేదు. ఎవరికీ మొరపెట్టుకున్నా తన సమస్య పరిష్కారానికి నోచుకోలేదని శనివారం వాపోయింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు దయానిధి మాట్లాడుతూ, నూతన పింఛన్ మంజురుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నేటికీ పింఛన్లు అందక వృద్ధులు అనేకమంది ఉన్నారన్నారు. అధికారులు స్పందించి బాలమ్మికి పింఛన్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు

జూనియర్ వైద్యురాలిపై అమానుష ఘటనను నిరసిస్తూ..

మన్యంలో వెల్లువెత్తిన నిరసనలు

అరకులోయలో మానవహారం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-అరకులోయ :కోల్‌కతాలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా అరకులోయ ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తమ విధులను బహిష్కరించి శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్, తహసిల్దార్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి పలు నినాదాలు చేశారు. హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. వైద్యులకు, సిబ్బందికి రక్షణ కరువవుతుందని తమకు రక్షణ కల్పించి ప్రజలకు స్వేచ్ఛగా వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పలువురు డాక్టర్లు కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సులు, ఆసుపత్రి శానిటేషన్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ:కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ దుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రత్నం, సూపర్వైజర్ రామారావు, హెచ్ వి పద్మ, మంజుల, ఎంఎల్‌హెచ్‌పిలు, స్టాపనర్సులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ చింతపల్లిలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు. ఆసుపత్రులలో భద్రతా చర్యలు పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు.ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బందికి భద్రత, రక్షణ కోసం పలు నినాదాలతో ఆసుపత్రి వద్ద నుండి హనుమాన్ కూడలి వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ లో వైద్యురాలిపై జరిగిన అతి దారుణమైన, కిరాతకమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శిక్షలను కఠినంగా అమలు చేయకపోవడంతోనే ఇటువంటి చర్యలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే సమాజంలో మానవ మృగాళ్లు అత్యాచారాలు, హత్యలకు పాల్పడేందుకు భయపడతారన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుంబ్రిగుడలో...

ముంచింగిపుట్టు : హత్యాచార నిందితులకు కఠినంగా శిక్ష విధించాలని మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని కిముడు గీతాంజలి, సిబ్బంది నిరసన చేపట్టారు.పోలీస్ స్టేషన్ జంక్షన్ సమీపంలో మానవహారం నిర్వహించారు. .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సిబిఐతో దర్యాప్తు చేసి నిందితులకు ఉరిశిక్ష విధించాలన్నారు. ఈ నిరసనకు ఆదివాసి గిరిజన ప్రజా సంఘాల నాయకులు, మహిళా గిరిజన సంఘం, ఐద్వా నాయకురాలు, మండల పాత్రికేయులు, వివిధ శాఖల ఉద్యోగులు మద్దతు తెలిపారు.

పాడేరు: నేరస్తులకు కఠిన శిక్ష విధించాలని పాడేరు లో డాక్టర్లు డిమాండ్ చేశారు. శనివారం అల్లూరి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ సిబ్బంది, డాక్టర్లు ర్యాలీ నిర్వహించి, పాత బస్టాండ్ అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ...బాధిత వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలన్నారు. మెడికల్ కాలేజీల్లో, ఆసుపత్రులలో మౌళిక వసతుల కల్పనతో పాటుగా, వైద్యులకు సెక్యూరిటీ మెరుగుపరచాలన్నారు.

మారేడుమిల్లిలో మానవహారం నిర్వహిస్తున వైద్య సిబ్బంది

నిందితులను శిక్షించాలి : సిపిఎం

డాక్టర్ల సమ్మె, నిరసనకు సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనరస సంపూర్ణ మద్దతు తెలిపారు. హత్య వెనుక డ్రగ్ మాఫియా,సంఘ వ్యతిరేక శక్తులున్నట్లు రకరకాల కథనాలు వస్తున్నాయని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ త్వరితగతిన పూర్తిచేసి దోషులను శిక్షించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు . మన రాష్ట్రంలో ప్రత్యేకించి ఏజెన్సీ డాక్టర్లకు, మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర మహిళా స్టాఫ్‌కు భద్రతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

వైద్యులు, సిబ్బంది ర్యాలీ

రంపచోడవరం : ఐఎంఎ పిలుపు మేరకు రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం ఆసుపత్రి నుంచి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు ప్లకార్డులు చేతబట్టి ర్యాలీ నిర్వహించి, అక్కడ నిరసన తెలిపారు. జోరువానలోనూ ఆందోళన కొనసాగించారు. హత్యాచార నిందితులను శిక్షించాలని, వైద్యుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. శనివారం ఉదయం 6 గంటల నుండి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు 24 గంటల పాటు అత్యవసర సేవలు తప్ప మిగతా సేవలను నిలుపుదల చేస్తున్నట్లు వైద్యులు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ఇందిరా, హాస్పిటల్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ శేషారెడ్డి, డాక్టర్లు సుధాకర్, ప్రేమ్ కుమార్, దుర్గా కిరణ్, క్రాంతి కిరణ్, రంపచోడవరం, గంగవరం మండలాల పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరులో నినాదాలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

మారేడుమిల్లి : మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లు శనివారం స్థానిక పిహెచ్‌సి నుండి ప్రధాన కూడలి మీదుగా పోలీసు స్టేషన్ కూడలి వరకు వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సుబ్రహ్మణ్యం, సిడిపిఓ ప్రసన్న, విశ్వనాథ్ పాల్గొన్నారు.

విఆర్.పురం : స్థానిక రేఖపల్లి పిహెచ్‌సి వైద్యులు, అన్ని విభాగాల వైద్య సిబ్బంది నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మా ముఖర్జీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులకు అరికట్టాలని, బాధిత జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానికులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో...

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

- సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలోని బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత అందరిపైనా ఉందని రంపచోడవరం సబ్ కలెక్టర్, బాల్య వివాహాల నిర్మూలన నోడల్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో డివిజన్ స్థాయిలో బాల్యవివాహాల నిర్మూలన కమిటీ సభ్యులు, డివిజనల్ స్థాయి అధికారులు, అంగన్వాడి టీచర్‌లు, సూపర్వైజర్లలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వివిధ పాఠశాలలకు సంబంధించిన బాలికలతో బాల్య వివాహాల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా ఎక్కడైనా పెండ్లి చేసిన ఎడల 2006 బాల్య వివాహాల చట్టం ద్వారా శిక్షింపబడతారని తెలిపారు. ఏజెన్సీలోని వివిధ గ్రామాలలోని ప్రజలకు, కుల పెద్దలు, గ్రామ పెద్దలకు బాల్య వివాహాల చట్టంపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయాల మహిళా పోలీసులు ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నప్పుడు ఆపి వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. 8, 9, 10 తరగతుల వారు విద్యార్థి దశ నుండి బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏజెన్సీలోని అన్ని పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై ఉపాధ్యాయుల తో బాలికలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంగన్వాడి కేంద్రాల పరిధిలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే పైఅధికారులకు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కొరకు అన్ని ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ సంధ్యారాణి, సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు కుసుమ కుమారి, ప్రకాష్ కుమారి, రాఘవ, అమ్మాజీ, రామలక్ష్మి పాల్గొన్నారు.

కంపూటర్లు అందిస్తున్న స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

డిజిటల్ లైబ్రరీకి అదనపు కంప్యూటర్లు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని భీమవరం, వేటుకూరు పాఠశాలల్లో స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిర్వహిస్తున్న కమ్యూనిటీ డిజిటల్ లైబ్రరీకి అదనపు కంప్యూటర్లను సమకూర్చింది. ఈ లైబ్రరీలో స్కూల్ పిల్లలకు, డిగ్రీ విద్యార్థులకు కంప్యూటరుపై శిక్షణ అందిస్తున్నారు. స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ ఇద్దరు ట్రైనీలను కూడా నియమించి క్లాసులు నిర్వహిస్తుంది. ఇక్కడ ఉన్న కంప్యూటర్లకి అదనంగా భీమవరం ప్రైమరీ స్కూల్లో కంప్యూటర్‌ను సమకూర్చారు. శనివారం స్వేచ్ఛ బృందం, కేఎల్ యూనివర్సిటీ విజయవాడ నుండి ప్రొఫెసర్ బృందం ఇక్కడ స్కూల్‌కు వచ్చి అక్కడ పిల్లలతో టీచర్లతో సంభాషించారు. సైన్స్, టెక్నాలజీని అనుసంధానం చేసి కొన్ని కొత్త పరికరాలను తయారుచేసే ప్రాజెక్టు కూడా కేఎల్ యూనివర్సిటీ రూపొందించబోతుందని డాక్టర్ అరుణ్ కుమార్ వివరించారు. ఈ సెంటర్ ని వినియోగించుకొని టెక్నాలజీపై పరిజ్ఞానం పెంచుకోవచ్చుని డాక్టర్ శ్రీపతి రాయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ ప్రతినిధి వర్గం దుర్గా ప్రసాద్, ప్రియాంక, మల్లీ రెడ్డి, శ్రీలత, వేటుకూరు గ్రామ సర్పంచ్ మల్లీశ్వరి, సిరిమల్లి రెడ్డి పాల్గొన్నారు.

ఎర్ర జెండా కప్పి నివాళులర్పిస్తున్న దృశ్యం

సిపిఎం సభ్యుడు సతీష్‌కు నివాళి

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని గండి కొత్తగూడెం గ్రామానికి చెందిన సీపీఎం శాఖ సభ్యుడు కట్టం సతీష్ (33) దుర్మరణం చెందాడు. గ్రామంలోని సతీష్ ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్‌పై నుండి పడి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, గండి కొత్తగూడెం గ్రామ నాయకులు సతీష్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- విఆర్.పురం : విఆర్ పురం మండలం చింతరేగుపల్లి గ్రామం గూటాల వీధిలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటి బోరు రిగ్గును శనవారం వేశారు. సర్పంచ్ పిట్టా రామారావు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్, మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, జనసేన నాయకులు ములకాల సాయి, గ్రామ పెద్దలు బాలకోటయ్య, సరఫరాజ ఆలి, వడ్డాణపు అంజన్రావు, పైదా గంగరాజు పటేల్, రవి అలీ, జెకెసి ట్రస్ట్ సభ్యులు ఎస్కే రియాజ్, షారూక్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బోరు పనులను ప్రారంభిస్తున్న జమాల్‌ఖాన్, సర్పంచ్ రామారావు తదితరులు

అనంతగిరిలో బొర్రా గుహలను తిలకిస్తున్న జడ్జీలు

అరకు అందాలు అద్భుతం

-సుప్రీంకోర్టు జడ్జి జెకె మహేశ్వరి

ప్రజాశక్తి-అరకులోయ:అరుకు అందాలు అద్భుతంగా ఉన్నాయని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జెకె మహేశ్వరి కొనియాడారు. శనివారం జస్టిస్ దంపతులు అరకులోయలో పర్యటించారు. రైలులో అరకు చేరుకున్న జస్టిస్ దంపతులను సంయుక్త కలెక్టర్ ఎంజె అభిషేక్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఘన స్వాగతం పలికారు. ముందుగా రైల్వే అతిథి గృహానికి చేరుకున్న జస్టిస్ దంపతులు ట్రైబల్ మ్యూజియం సందర్శించారు. అక్కడ గిరిజన సంస్కృతి సంప్రదాయాలను తిలకించి మంత్రముగ్దులయ్యారు. అనంతరం పెదలబుడు పంచాయతీలోని గిరి గ్రామదర్శిని సందర్శించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం గిరిజన వస్త్రధారణ గావించిన జస్టిస్ దంపతులు గిరిజన సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, పోక్సో కోర్టు జడ్జి జి. ఆనంది, అడిషనల్ జిల్లా జడ్జి పి.గోవర్ధన్ , గాజువాక సీనియర్ సివిల్ జడ్జి ఈ. రాజేంద్ర బాబు, రెండవ అదనపు సివిల్ జడ్జి డి.సోని, రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ కే. అనురాగ్, మూడవ అదనపు సివిల్ జడ్జి జి.కార్తీక్, అనకాపల్లి ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జ్ ఏ.రమేష్, చోడవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో వి. అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్, డిఆర్ఓ బి.పద్మావతి, అరకు తహసిల్దార్ వేణుగోపాల్, జిల్లా టూరిజం అధికారి దాసు తదితరులు పాల్గొన్నారు.

బొర్రా గుహలు తిలకించిన జడ్జిల బృందం

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రముఖ ప్రర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను పలువురు జడ్జిలు సందర్శించారు. గుహల ఏర్పాటుపై గైడ్స్, సిబ్బందిను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్, ఐటిడి పిఓ వి.వి.అభిషేక్, అడిషనల్ ఎస్పీ దిరాజ్, డిఆర్ఓ పద్మావతి పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యం చేస్తున్న మహేశ్వరి దంపతులు

ప్రశాంతంగా స్కూల్ కమిటీల ఎన్నికలు

మారేడుమిల్లి స్కూల్ పాఠశాల కమిటీ

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

జిల్లాలోని పలు ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే పాఠశాలల విద్యా కమిటీలకు శనివారం ఎన్నికలు జరిగాయి. ఆయా పాఠశాల హెచ్‌ఎంల ఆధ్వర్యాన జరిగిన ఈ ఎన్నికల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మెంబర్లను ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు.

మారేడుమిల్లి : మండలంలోని పలు పాఠశాలల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఎపి గిరిజన గురుకుల బాలుర పాఠశాల కమిటీ చైర్మన్ సూంట్రు కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా చెదల విశ్వ జ్యోతి, నీల్‌ఆర్మీ సాంగ్ జెడ్‌పి హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా గడుతూరి రవికుమార్, వైస్ చైర్మన్‌గా కత్తుల శ్రీదేవి, ఎంపిపి పాఠశాల కమిటీ చైర్మన్ బొరగా తిత్వదాస్, వైస్ చైర్మన్‌గా బచ్చు అనిత, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల కమిటీ చైర్మన్‌గా జారేపల్లి రాజేశ్వరి, వైస్ చైర్మన్‌గా పూజారి మంగమ్మ, కెజిబివి కమిటీ చైర్మన్‌గా డి తేజస్విరి, వైస్ చైర్మన్‌గా కె.నారాయణరెడ్డి, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కమిటీ చైర్మన్‌గా పి విజయశాంతి, వైస్ చైర్మన్‌గా సిహెచ్ చిన్నారెడ్డి ఎన్నికయ్యారు.

దేవీపట్నం : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఇందుకూరుపేట జెడ్‌పి హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా టిడిపికి చెందిన సామిరెడ్డి వీరభద్ర రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా కడుపుట్ల సూర్యకుమారి, యుపి స్కూల్ కమిటీ చైర్మన్‌గా గొల్లపల్లి అరవింద్ ఎన్నికయ్యారు. మంటూరు కాలనీ, పెద్ద బియ్యంపల్లి పాఠశాలల కమిటీల ఎన్నికలు వాయిదా వేశారు.

రాజవొమ్మంగి : రాజకీయ పార్టీలు స్కూల్ కమిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజువొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎంసి కమిటీ ఎన్నిక స్థానిక సంస్థల ఎన్నికలను తలపించింది. చైర్మన్ ఎన్నికకు చాలామంది పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో ఏమైనా గొడవలు జరగవచ్చునని అనుమానంతో రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్ వెంకయ్య గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విఎంసి కమిటీ ఎన్నికలు పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎంఈఓ సత్యనారాయణ దొర పర్యవేక్షించారు. కార్యక్రమంలో తాహశీల్దార్ అల్లు సత్యనారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం

విఆర్.పురం : మండలంలోని పలు పాఠశాలల విద్యా కమిటీల ఎన్నికలు శనివారం జరిగాయి. విఆర్.పురం జెడ్‌పి ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా ముత్యాల శంకర్‌రావు, వైస్ చైర్మన్‌గా బేతం వినోద లక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చింతూరు : మండలంలోని చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా వరప్రసాద్, బొడ్డుగూడెం ఎజిహెచ్‌ఎస్ పాఠశాల వైస్ చైర్మన్‌గా సిపిఎంకు చెందిన శవలం దేశాయ్ ఎన్నికయ్యారు.

సీలేరు : జికె.వీధి మండలం సప్పర్ల కమిటీ చైర్మన్‌గా జి.చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా పూజారి నారాయణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాకూరు బుజ్జి బాబు, ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, సభ్యులు కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు శనివారం కోలాహలంగా జరిగింది. ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత, గిరిజన ఆశ్రమ, కేజీబీవీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీలను ఎన్నుకున్నారు. దీంతో పాఠశాలల్లో ఎన్నికల సందడి నెలకొంది. కమిటీలుగా ఏర్పడిన యాజమాన్యం పాఠశాలల అభివృద్ధి, పిల్లల విద్య ప్రగతికి తోడ్పాటునివ్వాలని మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దేవీపట్నం మండలం ఇందుకూరుపేట స్కూల్ కమిటీ...

జికె.వీధి మండల సప్పర్ల కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామ పెద్దలు

బ్యాంకు వద్ద ఉన్న గిరిజనులు

బ్యాంక్ ఆఫ్ బరోడా కిటకిట

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని ఉపాధి పనుల డబ్బుల కోసం వచ్చిన గిరిజనులతో బరోడా బ్యాంక్ కిటకిటలాడింది.మండలంలోని గత మూడు నెలల క్రితం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టి ఎట్టకేలకు పనుల డబ్బులు పడటంతో శనివారం వారపు సంతకు వచ్చిన గిరిజనులు బరోడా బ్యాంకుకు అధికంగా చేరుకున్నారు. ఇంటర్ నెట్ సరిగా పని చేయక పోవడంతో సగానికి మంది రైతులకు పేమెంట్లు కాక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది తీసుకోగా మరి కొంతమంది తిరిగి వెళ్లిపోయారు. బరోడా బ్యాంక్ సేవలు మెరుగుపరిచి, నెట్ సౌకర్యం ఉండే విధంగా బ్యాంకు యాజమాన్యం చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు. డబ్బులు తీసుకుని సంతలో నిత్యావసర సరుకులు కొనుక్కోవడానికి వీలుంటుంది. నెట్ సౌకర్యం లేక డబ్బులు తీసుకపోతే ఆరోజు ఇంటి ఖర్చులు లేకుండా వట్టి చేతులతో ఇంటికి వెళ్లిల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిడిపిఒ

అంగన్‌వాడీలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని ఒల్ల, ఇసుక గరువు, మునుకుపుట్టు తదితర అంగన్వాడి సెంటర్లకు శనివారం ఐసిడిఎస్ సిడిపిఒ తనిఖీ చేశారు. రెండు సెంటర్లలో కూడా పిల్లలు లేకపోవడంతో టీచర్ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సిడిపిఒ సిహెచ్ బాలామణి దేవి మాట్లాడుతూ, అంగన్వాడి టీచర్లు ఆటపాటలతో విద్యాబోధనకు చొరవ చూపాలని ఆమె అన్నారు. రెండు సెంటర్ల టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ జీతాలు నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. అంగన్ టీచర్లు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. ఎటువంటి రిమార్క్ లేకుండా సెంటర్లను నడపాలన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్సు బృందం

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ ఆరోగ్య కేంద్రంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు శనివారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు డాక్టర్ లూసీ, డిపిఎం జగదీష్, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్స్ నాగమణి బృందంగా పాల్గొన్నారు. వైద్యారోగ్య కేంద్రంలో జరిగే వైద్య ఆరోగ్య సేవలు, గర్భిణీలకు ,బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు ఎం సిహెచ్ కార్డులు, ఆన్‌లైన్ విధానం కిషోర్ బాలికలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. గర్భిణీలకు రక్త పరీక్షలు, కిశోర బాలికలకు హెచ్‌బి పరీక్షలు చేయించడంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యామ్ కుమార్, సిహెచ్ఒ ప్రసాద్, హెచ్‌ఎస్ సత్యవతి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

పూర్తిస్థాయి విచారణ తర్వాతే చర్యలు
డిపిఒ కొండలరావు

ప్రజాశక్తి- అరకులోయ: మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిన అనంతరం సంబంధిత సర్పంచ్ పై చర్యలు తీసుకుంటామని అల్లూరి సీతారామరాజు జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. పద్మాపురం పంచాయతీలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఆమోదం లేకుండా ఆ పంచాయతీ సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేసినట్లు పద్మాపురం పంచాయతీ వార్డు మెంబర్లు ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో డిపిఒ శనివారం పద్మాపురం పంచాయతీ కార్యాలయంలో విచారణ ప్రారంభించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తనను పెదలబుడు మేజర్ పంచాయతీ కార్యాలయంలో కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ, సమగ్రంగా 15 రోజులపాటు రికార్డుల పరిశీలన చేసి ఆ నివేదికను జిల్లా కలెక్టర్ కు నివేదిస్తామన్నారు అనంతరం విచారణలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల్లో సుమారు రూ.20 లక్షల వరకు దుర్వినియోగం జరిగిందని వార్డు మెంబర్లు మూకుమ్మడిగా సర్పంచ్ పెట్టెలి సుస్మితపై ఫిర్యాదు చేశారన్నారు.ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.గ్రామాల్లో వీధి దీపాలు వెలగడం లేదని విలేకరులు ప్రస్తావించగా ఆన్లైన్ ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నలబుడు పంచాయతీలోని హట్టగూడ సమీపంలో బినామీ పేరు తో రిసార్ట్ నిర్మాణంపై వెంటనే విచారణ జరిపి తనకు నివేదిక ఇవ్వాలని అల్లూరి జిల్లా డిపిఒ కొండలరావు అరకులోయ ఈవోపీఆర్డీకి ఆదేశించారు. బినామీ పేరుతో ఓ గిరిజనేతరుడు భారీ రిసార్ట్ నిర్మిస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పై విధంగా స్పందించారు. లాడ్జిల నిర్మాణాలకు జి ప్లస్ టు అనుమతులు ఇచ్చే అధికారం పంచాయతీలకు లేదని ఆయన స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు పొందిన తర్వాత జి ప్లస్ టు నిర్మించాల్సి వుంటుందని ఆయన అన్నారు. పర్యాటక కేంద్రమైన అరకు లోయలో డ్రైనేజీ పై ఉన్న నిర్మాణాలను వెంటనే తొలగించాలని పంచాయతీ ఈవోను డిపిఒ కొండలరావు ఆదేశించారు. డ్రైనేజీపై నిర్మాణాలతో మురుగు నీరంతా రోడ్లపై పారుతుందని స్థానికులు డిపిఒకు ఫిర్యాదు చేయడంతో ఆ నిర్మాణాలను తొలగించాలని ఆయన అన్నారు. డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో రాజకుమార్ పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో...

ఎన్నిక నిలుపుదల సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికలు నిలుపుదల చేయడం సరైన పద్ధతి కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు మహేష్ బాబు విమర్శించారు. ఎస్ఎంసి ఎన్నికల సంబంధించి సిపిఎం, వైసిపి, జనసేన బలపరిచిన విద్యార్థుల తల్లిదండ్రులు పోటీలో నిలవడంతో అధికార పార్టీ నాయకులు ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికలు నిలుపుదల చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం, వైఎస్సార్ సిపి, జనసేన మద్దతుతో పోటీ చేస్తున్న కోడా కాశీరావు చైర్మన్‌గా విజయం సాధించే అవకాశం ఉండడం మూలాన గ్రామానికి చెందిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొచ్చి ఫోన్లు చేయించి మధ్యాహ్నం రెండు గంటల వరకు కాలయాపన చేయించి ఎన్నికలు జరుపకుండా తాత్సారం చేశారని తెలిపారు. కోరం లేదని, సమయం అయిపోయిందని ప్రధానోపాధ్యాయులు మూడు గంటలకు ఎన్నికలు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీంతో, విద్యార్థుల తల్లిదండ్రులు, సిపిఎం, వైసిపి, జనసేన నాయకులు ప్రధానోపాధ్యాయుని ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికు లొంగి ప్రధానోపాధ్యాయులు ఎన్నికలు నిలుపుదల చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ ఆధ్వర్యంలో నక్కపల్లి మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు.నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలు నిలుపుదల చేసిన ప్రధానోపాధ్యాయులు, అధికార పార్టీ నాయకులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం మహేష్ బాబు, సిహెచ్ సోమేష్, బి.నూకరాజు, ఎం దేముడు, పి.కాశీరావు, సిహెచ్. తాతాజీ, బి.తాతీలు, బి.రమణ, బి .అప్పలరాజు, పి.కాశీ, కె.రాజారావు, డి.నానాజీ, జీ.అంజి, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

టీచర్‌ను నియమించరూ..

ప్రజాశక్తి-రోలుగుంట: తమకు ఒక టీచర్‌ను నియమించాలని రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ కొండశిఖర గ్రామాలైన నీళ్లబంద, పిత్రిగెడ్డ గ్రామస్థులు శనివారం చేతులు జోడించి కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కే.గోవిందరావు మాట్లాడుతూ, ఈ గ్రామాల్లో కొందు గిరిజనులు 15 కుటుంబాలు ఐదు సంవత్సరాల నుండి పది సంవత్సరాల మధ్యలో 12 మంది పిల్లలు ఉన్నారన్నారు. ఈ గ్రామం నుండి ఆర్ల స్కూల్ కి వెళ్ళాలంటే 10 పది కిలోమీటర్ల దూరంలో నీళ్ల బంద్ గ్రామం ఉందని, రాను పోను 20 కిలోమీటర్ల నడవాల్సి వస్తుందన్నారు. దీనిపై గతంలో ఆందోళన చేయడంతో గత సంవత్సరం ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేసి ఒక టీచింగ్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సంవత్సరం రెండు నెలలు అవుతున్నా ప్రత్యేక స్కూల్ కోసం ప్రతిపాదన పంపామని చెబుతున్నా అమలు కాలేదన్నారు. నేటికి కూడా స్కూల్ బ్యాగ్‌లు, బట్టలు ఇవ్వలేదన్నారు. రోలుగుంట మండలం పిత్రిగడ్డ, గొలుగొండ మండలం బుడ్డడపాడు, కోటవురట్ల మండలం అణుకు గ్రామాల్లో గతంలో ప్రత్యామ్నాయ స్కూల్ ఏర్పాటు చేశారని, నేటి వరకు రెన్యువల్ చేయలేదన్నారు. తక్షణమే కొత్త స్కూల్ ఏర్పాటు చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

18తులాల బంగారం, 20 తులాల వెండి స్వాధీనం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టుచేశారు. అతని నుంచి 18 తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు నేర విభాగపు డిసిపి వెంకటరత్నం తెలిపారు. పిఎం.పాలెం స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జివిఎంసి ఆరో వార్డు పరిధి ఆర్‌హెచ్ కాలనీలో కె.ధనుంజయరావు తన కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడని తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 5వ తేదీన భార్య అనారోగ్యం కారణంగా ఇంటికి తాళం వేసుకొని ఆసుపత్రికి వెళ్లారని పేర్కొన్నారు. ధనుంజయరావు తిరిగి వచ్చేసరికి ఇంటి ప్రధాన తలుపు తాళం పగలగొట్టి ఉందని, ఇంట్లో బీరువాలోని 18 తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పిఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసిన నేర విభాగం పోలీసులు చేపట్టిన విచారణలో అదే కాలనీకి చెందిన ఆనంద్, చరణ్‌తో పాటు బాబా కాలేజ్ సమీపంలో ఉన్న బి2 కాలనీకి చెందిన కోరాడ కరుణకుమార్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించినట్లు చెప్పారు. కరుణకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుని నుంచి వస్తువులను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించిన హసీనా బేగం, రమేష్, రవినాయక్, జేయం మల్లిక్‌ను ఆమె అభినందించారు.

ఇటీవల పోతినమలయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరాం ప్రాపర్టీ వద్ద ఒక కిలో 40 గ్రాములు బంగారంతో పాటు రూ.20 లక్షలు నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ చోరీపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతుందన్నారు. పలు కాలనీ వాసులు అందరూ కలిసి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఎడిసిపి మహేష్, ఎస్ఐ రంభ శ్రీనివాసరావు ఉన్నారు.

ఎస్‌బిఐ ఎటిఎంలో చోరీ

- రూ.14.17 లక్షలు అపహరణ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక మెయిన్ రోడ్‌లో గల ఎస్బిఐ ఎటిఎంలో శుక్రవారం భారీ చోరీ జరిగింది. దండగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో చోరీకి పాల్పడిన సమయం పూర్తిగా స్పష్టత లేదు. గ్యాస్ కట్టర్ ఉపయోగించి ఏటీఎంను పగలగొట్టి రూ.14,17,000 దుండగులు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పరవాడ డిఎస్‌పి సత్యనారాయణ, ఎలమంచిలి సీఐ గఫూర్, స్థానిక ఎస్సై ప్రసాదరావు, పలువురు పోలీస్ సిబ్బంది చోరీ జరిగిన ప్రాంతాన్ని శనివారం ఉదయం పరిశీలించారు. నిందితుల ఆచూకీ కోసం అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సిఐ వివరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగంపేట పంచాయతీలో సర్పంచ్ జువ్వల లక్ష్మి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను శనివారం ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా కాలువల్లో పేరుకు పోయిన పూడికను తీయించారు. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జువ్వల దేముడు తదితరులు పాల్గొన్నారు.

19న తాండవ నీరు విడుదల

ప్రజాశక్తి -నాతవరం: ఈనెల 19న సోమవారం తాండవ జలాశయం నీటిని విడుదల చేస్తామని డిఈ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. తాండవ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 376.2 అడుగులు నీరు ఉందని చెప్పారు. సోమవారం ఉదయం 8:45 నిమిషములకు పంట పొలాలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. , జలాశయ పరిధిలోని చివరి ఆయుకట్టు వరకు నీటిని సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు.

విద్యార్థులతో పనులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వం పాఠశాల వద్ద శనివారం నిర్వహించిన విద్యా కమిటీ ఎన్నికల్లో విద్యార్థులతో పనులు చేయించారు. మేడపై ఉన్న కుర్చీలను క్రిందకి మోయించారు. దీంతో. విద్యార్థుల తల్లిదండ్రులు సహా పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఒకపక్క విద్యా కమిటీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలోనే ఇటువంటి పనులు చేయించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

రొట్టెలు, పండ్లు అందజేస్తున్న సిఐ అప్పలనాయుడు, నాయకులు

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-సీలేరు : ఏపీడబ్ల్యూజే 67 వార్షికోత్సవ వేడుకలు జీకే వీధి మండలంలో పాత్రికేయులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జికె.వీధి సిఐ ఎ.అప్పలనాయుడు చేతుల మీదగా రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి, సీనియర్ పాత్రికేయులు రమణ, లక్ష్మణ్, ధారబాబు, పాత్రికేయులు పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలపై ఉద్యోగుల అసంతృప్తి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : 15 ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు స్థానచలనం కలగనుంది. ఉపాధ్యాయ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మినహా ఒకచోట ఐదేళ్లపాటు పనిచేసిన ఉద్యోగులకు ప్రభుత్వం బదిలీ తప్పనిసరిచేసింది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి శనివారం ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. బదిలీలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరగనున్నాయి. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 18 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులు, వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు దాదాపు 13వేల మంది వున్నారు. మిగిలిన శాఖల్లో ఐదువేల మంది పనిచేస్తున్నారు. వీరిలో ఐదేళ్లు పూర్తిచేసిన వారికి బదిలీ జరగనుంది. ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి కొంతమంది ఉద్యోగులు రానున్నారు. మైదానం నుంచి ఏజెన్సీకి కొందరు వెళ్లనున్నారు. ఈ ఏడాది జులై 31 నాటికి ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులు కచ్చితంగా బదిలీకానున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు చేయడంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బదిలీ ప్రక్రియ కోసం ఆగస్టు 19 నుంచి 31 వరకు ఉద్యోగుల బదిలీలపై వున్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈలోపు బదిలీలు పూర్తిచేసి మళ్లీ సెప్టెంబరు ఒకటి నుంచి నిషేధం విధించింది. ఐదేళ్ల పాటు ఒక చోట పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరిచేసి, మూడేళ్లు అయిన వారికి బదిలీకి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. ఏజెన్సీలో రెండేళ్లు పనిచేసిన ఉద్యోగులు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు.

రెవెన్యూ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, పురపాలక, గ్రామవార్డు సచివాలయాలు, గనులు, పౌర సరఫరాలు, అన్ని ప్రభుత్వ శాఖల ఇంజనీరింగ్ ఉద్యోగులు, దేవాదాయ, రవాణా, అటవీ, పరిశ్రమలు, విద్యుత్, స్టాంపులు రిజస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులశాఖ, ఎక్సైజ్ శాఖల ఉద్యోగుల బదిలీలకు అనుమతిచ్చింది. ఎక్సైజ్ శాఖ ఉద్యోగులకు సెప్టెంబర్ 5 నుంచి 15 వరకు బదిలీకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

రవీంద్రభారతిలో అగ్రికల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం రవీంద్రభారతి పాఠశాలలో అగ్రి నోవా (అగ్రికల్చరల్ ఫెస్ట్) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖపట్నం జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి హాజరై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక ప్రగతిలో వ్యవసాయం ఒక కీలక అంశం అన్నారు. నిర్దిష్టమైన పద్ధతిలో మొక్కలను, జంతువులను పెంచి పోషించడం, తద్వారా ఆహారాన్ని, మేత, నార, ఇంధనాన్ని ఉత్పత్తి చేయడమే వ్యవసాయం ముఖ్య లక్ష్యమన్నారు.

విశిష్ట అతిథి ఎపిసిఎన్ఎఫ్ డిపి ఎ.మోహనరావు మాట్లాడుతూ, దేశానికి వ్యవసాయం వెన్నెముక వంటిదన్నారు. కొత్త వ్యవసాయ పద్ధతులను అవలంభించి పురోగతిని సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వ్యవసాయ నమూనాలను అతిథులు పరిశీలించారు. కార్యక్రమంలో నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్, సిజిఎం జిఆర్.వసంత, పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల వర్గీకరణతో కూడిన ప్రత్యేక మ్యాప్ తయారు చేయాలని జిల్లా రెవెన్యూ, జివిఎంసి అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా ఆదేశించారు. లేఅవుట్ల అప్రూవల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సరస్సులు, కాలువలు ఉండే ప్రాంతాల్లో ఒకటికి రెండు సార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం ఆయన తహశీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు, జివిఎంసి, విఎంఆర్‌డిఎ, రెవెన్యూ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భూముల రిజిస్ట్రేషన్, 22ఎ, డి.నోటిఫైడ్, భూసేకరణ, సమీకరణ, ఫ్రీహోల్డ్, డిజిటలైజేషన్, జాయింట్ ఎల్‌పిఎంల రూపకల్పన, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనప్పుడు స్థానికంగా అనుసరిస్తున్న విధానాల గురించి, ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. 22ఎ పరిధి నుంచి తొలగించినవి, ఫ్రీ హోల్డ్ చేసిన భూముల వివరాలపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై స్థానిక అధికారులు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల డిజిటైలేజేషన్ ద్వారా ప్రభుత్వ భూములను కాపాడుకునే అవకాశం ఉందని, ఆ దిశగా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉండే భూములను వర్గీకరిస్తూ రెవెన్యూ, జివిఎంసి రెవెన్యూ విభాగం కలిసి మ్యాప్ రూపొందించాలని, ఒక్కో రకం భూమికి ఒక్కో రకం రంగు చూపిస్తూ మ్యాప్ ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వాటిని జిపిఎస్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. సమగ్ర వివరాలతో కూడిన రికార్డులను తయారు చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. రికార్డుల తయారీలో రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ విభాగం, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయం వహించాలని, అందరి వద్దా ఒకేలాంటి రికార్డు ఉండేలా తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి 3డి మ్యాపింగ్ రూపొందించాలని, వీలుంటే ఎఐ టెక్నాలజీ సహాయాన్ని తీసుకోవాలని చెప్పారు. రికార్డులు ఓవర్ ల్యాపింగ్ కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆధునిక యుగంలో ఉన్నాం కాబట్టి.. ఆ దిశగానే ఆలోచిస్తూ ప్రభుత్వ భూములను పరిరక్షించాలని అధికారులకు హితవు పలికారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిసోడియా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలకు కనీస వసతులు కల్పించాలి

రిజిస్ట్రేషన్, ఇతర అవసరాల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అక్కడ కనీస వసతులు కల్పించాలని సిసోడియా సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులకు, ప్రజలకు మధ్య అడ్డుగోడలు సరికాదని, వారిని బయటే నిల్చోబెట్టి పనులు చేయడం సరికాదని పేర్కొన్నారు. వారిని కూర్చోబెట్టి పని చేయాలని, వారిని మర్యాద పూర్వకంగా చూడాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు.

రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలి : కలెక్టర్

సమావేశంలో భాగంగా వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. 22ఎలో చేస్తున్న ప్రక్రియలకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను అప్డేట్ చేయాలని సూచించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, అర్బన్ ల్యాండ్ విభాగం రూపొందిస్తున్న రికార్డుల వివరాల్లో తారతమ్యం లేకుండా చూసుకోవాలన్నారు. అర్బన్ సర్వే విభాగంతో మిగిలిన విభాగాలు సమన్వయం వహించాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ భూముల తాజా పరిస్థితిని తెలుపుతూ నివేదికలు ఇవ్వాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదని తేల్చి చెప్పారు. దేవాదాయ భూముల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖపట్నం, భీమిలి ఆర్‌డిఓలు హుస్సేన్ సాహెబ్, సీతారాంమూర్తి, జిల్లా రిజిస్ట్రార్ సృజన, వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల కనుసన్నల్లోనే యుద్ధాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : పెట్టుబడి దారుల కనుసన్నల్లోనే యుద్ధాలు జరుగుతున్నాయని యుపిఎస్‌సి పూర్వ సభ్యులు, పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కెఎస్.చలం ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యూజె) 67వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 'పొరుగుదేశాల్లో యుద్ధాలు - భారత్‌పై వాటి ప్రభావం' అనే అంశంపై ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆచార్య కెఎస్.చలం హాజరై మాట్లాడారు. భారత దేశం అలీన విధానాన్ని పాటించి ఇతర దేశాలతో సత్ సంబంధాలు కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇతర దేశాల్లో దాదాపు 2 కోట్ల మంది భారతీయులు ఉన్నారని, వారి ద్వారా జాతీయ ఆదాయంలో సుమారు 4 శాతం సమకూరుతుందని వివరించారు. సౌదీ అరేబియా, దుబాయ్ వంటి దేశాల్లో మధ్యతరగతికి దిగువన ఉన్న వారు ఎంతోమంది కార్మికులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా దేశాలతో సత్సంబంధాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత లేదని, కనీస అవసరాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ యుద్ధ ప్రభావాలు వలన ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం వల్ల చమురు ధరలు పెరిగాయన్నారు. ఐద్వా ప్రతినిధి ఆచార్య ప్రియాంక మాట్లాడుతూ, యుద్ధం వద్దు - శాంతే ముద్దు అనే నినాదంతో భారత్ ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అమెరికా సామ్రాజ్య వాద ధోరణితో ఉక్రెయిన్ పాలస్తీనాలు బలిపశువుగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (సామ్నా) రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు పాల్గొన్నారు.

ఉత్పత్తి సామర్థ్యంపై ఉక్కుపాదం..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర పెద్దలు చెప్పిన మాటలకూ, ఆచరణకూ పొంతన లేకుండా పోతోంది. ఉత్పత్తి సామర్థ్యం పెంచుతామని పైకి చెబుతూనే కేంద్రం ఉత్పత్తిని దెబ్బతీస్తూ ఉక్కుపాదం మోపుతూనే వుంది. ఉక్కును కంటికి రెప్పలా పరిరక్షించుకోడానికి కార్మిక వర్గం అనుక్షణం 1284 రోజులుగా పోరాడుతూనే వుంది. ప్రస్తుతం ప్లాంట్‌లో ఉక్కు ఉత్పత్తికి రా మెటీరియల్ కొరత తీవ్రంగా వెంటాడుతోంది. ఐరన్ ఓర్, ఇనుప ఖనిజాన్ని అందుబాటులో లేకుండా యాజమాన్యం చేసింది. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు రెండూ ద్వంద్వ వైఖరినే ప్రదర్శిస్తున్నాయి.. ముఖ్యంగా బిజెపి సర్కారు 2021లో ఉక్కుపై ప్రైవేటీకరణ విధానం ప్రకటించిన నుంచీ కక్షపూరితంగానే ప్లాంట్ విషయంలో పావులు కదుపుతోంది. 2017 జనవరి నుంచి కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయకుండా తీవ్ర తాత్సారం చేస్తోంది.

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి స్వయంగా స్టీల్‌ప్లాంట్‌లోకి నెలన్నర క్రితం కాలు పెట్టి ఇక్కడి కార్మికుల ఆవేదనలు విన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రశ్నే లేదని కొట్టిపారేశారు. ఆయన వెళ్లాక పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. ప్లాంట్‌లో ఒక్కొక్క విభాగాన్నీ పని చెయ్యనివ్వకుండా పూటకో కుట్ర చేస్తున్నారు. సొంత గనులు ఇవ్వకుండా, బ్యాంకులో అప్పు కూడా దొరక్కుండా బిజెపి చేస్తోంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంతో చర్చించి నిర్ణయం వెనక్కి తీసుకునేలాగ ప్రయత్నం చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు భరోసా ఇచ్చారు. గెలిచిన తరువాత ఆయన ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలూ చేయడం లేదు. ఢిల్లీకి కనీసం అఖిల పక్షాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేపట్టకపోవడం తెలిసిందే. సెయిల్‌లో ప్లాంట్‌ను విలీనం చేయాలన్న కార్మిక డిమాండ్‌ను సైతం కూటమి నేతలు పరిగణలోకి తీసుకోవడం లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. 30 ఏళ్లుగా సొంత గనులు లేకపోయినా ఉత్పత్తి సామర్థ్యం తగ్గకుండా కార్మికులు, అధికారులు, నిర్వాసితులు, కాంట్రాక్టు సిబ్బంది కృషి చేస్తూ వచ్చారు. మరోపక్క ఉక్కులో ఉద్యోగులు భారీగా రిటైర్ అవుతున్నా గడిచిన ఐదేళ్లలో వాళ్ల స్థానంలో ఒక్క ఉద్యోగాన్నీ యాజమాన్యం తీయలేదు. ఐదేళ్లలో సుమారు ఐదు వేలమంది ఉద్యోగులు, అధికారులు రిటైర్ అయ్యారు. 2025కి ఇప్పుడున్న అధికారులు, కార్మికులు సగానికిపైగా రిటైర్ అవుతారు. కావాలనే కేంద్రం రిక్రూట్మెంట్ చేయడం లేదు.

తాజా ఆంక్షలతో ప్లాంట్ సామర్థ్యం పాతాళానికి..

తాజాగా ఉక్కు యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను 30 శాతం మేర తగ్గించాలని కేంద్రం డైరక్షన్‌లో ఆలోచిస్తోంది. అధికారులకు పిఆర్‌సి నిలిపి వేయాలని నిర్ణయించడం అత్యంత పాశవికమైన చర్యగా పలువురు అభివర్ణిస్తున్నారు. కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఆపేసే నిర్ణయం యాజమాన్యం చేసింది.

22న కార్మిక ఆందోళన

తాజాగా ప్లాంట్‌లో బొగ్గు నిల్వల కొరత వుంది. పరిశ్రమ నడవడానికి ఆస్కారం లేకుండా పోయింది. గంగవరం పోర్ట్‌లో ఇంకా వేల టన్నుల నిల్వలు స్టీల్ ప్లాంట్‌కి రాకుండా అక్కడే గుట్టలు గుట్టలుగా పడి ఉండిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనికోసం కృషి చేయడం లేదు. ఓ వైపు ముడి సరుకు అందించకుండా కేంద్రం ఎండగడుతూ.. మరో పక్క పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామంటూ చెప్పడం దారుణం. ఆ మాటలను జనం నమ్మడం లేదు. ఏదైనా ఆచరణలోకి వచ్చే ప్లాంట్ అభివృద్ధి పని ప్రారంభించకపోతే కార్మికుల నిరసనాగ్రహానికి కేంద్రం గురికాక తప్పదు. అందులో భాగంగా ఈ నెల 22న ఉక్కు సిఎమ్‌డి కార్యాలయం వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన, ముట్టడికి కార్మిక వర్గం సిద్ధమవుతోంది. ప్లాంట్‌ను సరైన దిశలో నడిపించే విధానంతో యాజమాన్యం లేకపోతే కార్మికులు, ప్రజలు పోరాటాన్ని ఉధృతం చేసే అవకాశముంది.

22న ఉత్తరాంధ్ర జాతర

ప్రజాశక్తి-సీతమ్మధార : తరతరాలుగా ఆదరణ కలిగి ఉన్న ఉత్తరాంధ్ర కళలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకు ఈ నెల 22న విశాఖలో 'ఉత్తరాంధ్ర జాతర' కార్యక్రమం నిర్వహించనున్నట్టు రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వివి.రమణమూర్తి తెలిపారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో సుమారు 2వేల మంది సమక్షంలో భారీగా కళా జాత ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హోంమంత్రి వంగలపూడి అనిత, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సినీ కమేడియన్ బ్రహ్మానందం, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కళాకారులు హాజరు కానున్నట్టు తెలిపారు. కళా సంఘాల ప్రతినిధులతో కలిసి రమణమూర్తి 'పౌర గ్రంథాలయం'లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు.